# దంతసిరి!

-శారదా అశోకవర్ధన్

వెంకట సత్యన్నారాయణగారూ బాలా త్రిపుర సుందరిల కళ్యాణ షష్ఠి పూర్తి దినోత్సవం ఆ రోజు. వాళ్ల పిల్లలు కామేశ్వరర్రావూ, రామేశ్వరరావులు ఈ వేడుకని ఘనంగా చెయ్యాలని బంధువులనీ, స్నేహితులనీ, అందర్నీ హోటల్ 'బృందావనం'లో డిన్నర్ ఏర్పాటు చేసి పిలిచారు. సత్యం, బాల పెళ్లి రోజు, అందులోనూ అరవైయవ పెళ్లిరోజు అని తప్పకుండా వెళ్లాలని బంధు మిత్రులందరూ వచ్చేసారు. కామూ, రామూ (కామేశ్వరర్రావు, రామేశ్వర రావు)లు చాలా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. కోడళ్లూ, మనమలు మన మరాళ్ల హడావిడి సరేసరి! ఎన్నోరకాల స్వీట్లు, హాట్లూ, ఐస్‌క్రీములతో పాటు పల్లీపాకం బిళ్లలూ, జీడిపాకం బిళ్లలూ, మైసూర్‌పాక్ ముక్కలు, సున్నుండలూ పెట్టించారు. ఘుమ ఘుమలాడే నేతి వాసనలతో, నోట్లో నీళ్లూరిపోయాయ్ బాలాత్రిపురసుందరికి చిన్నప్పుడు వాళ్ల అమ్మా అమ్మమ్మా చేసే ఆ వంటకాలు తలచుకుని. పళ్లెంలో పోసిన పల్లీపాకంలా మొహం వెడల్పుగా చేసి, భర్తవంక నవ్వుతూ చూసింది.

సరిగ్గా అదే సమయానికి అతనూ ఆమె వంక చూడడంతో "ఏంటీ? ఎందుకు నవ్వుతున్నావ్?" అడిగాడు నవ్వుతూ సత్యంగారు.

"ముందు మీరెందుకు నవ్వుతున్నారో చెప్పండి?" అంది గోముగా మొహం పెట్టి బాల.

"చక్కగా మెత్తగా నీ తలకట్టులా బ్రెడ్ పుడ్డింగ్. ఎంత బావుందో నోరూరి నవ్వుతూ నీవైపూ, నీ జుట్టు వైపూ చూశాను. అంతే" అన్నారు సత్యంగారు.

"పోండి...మీకసలు పాత రుచులూ వాటి కమ్మదనం తెలిస్తే ఇలా బ్రెడ్డు ముక్కల పిండి వంటతో పోల్చరు. అయినా..మీ అమ్మ చేసిందా. మీ అమ్మమ్మ చేసిందా? ఎద్దుకేం తెలుసు అటుకుల రుచి అనీ మీకేం తెలుస్తుంది పాపం!" అంటూ జాలిపడుతూ మూతి మూడు వంకర్లు తిప్పింది. ముక్కుకున్న ఏడురాళ్ల బేసరి ముక్కు పుడక తళుకులు వెతుక్కుంటూ, దాన్ని గిరగిరా తిప్పుతూ "ఇప్పుడయినా తినండి పోనీ!" అంది.

"నాకు పళ్లు వీకే బాబూ! తమలపాకు కిళ్లీనే సరిగ్గా కొరికి తినలేను. ఆ మాట కొస్తే నీ బుగ్గ కొరకలేనూ!" అన్నారు సత్యంగారు చిలిపిగా చూస్తూ.

"దేన్నికైనా దంతసిరి ఉండాలంటారు. తినడం కూడా ఒక సిరి సంపదే! మా అమ్మ చెప్పేది" అంది గొప్పగా బాల.

"అవునవును! అందుకే బాగానే తింటున్నావుగా. నీ దంతసిరి చాలా బాగుంది. బచ్చలాగ కనిపించినా, కిస్సుకిస్సున నమిలేస్తావు మేకలా. దిబ్బరొట్టె పెచ్చునీ గరగరా కొరికి మింగేస్తావు. ఉండ్రాళ్లు సరేసరి...గణపతికి చెల్లివే" అన్నారు పళ్లికిలించి నవ్వుతూ ఆమెని ఉడికిస్తూ సత్యంగారు.

"అవున్లెండి. ఆకుల రుచి మేకలకీ ఆవులకీ కాకపోతే, పిల్లులకీ, ఎలుకలకీ తెలుస్తుందా?" దెబ్బకి దెబ్బలా దెప్పింది బాల.

అంతలో అక్కడికి ఆహ్వానితులు ఒక్కొక్కరే రావడంతో వాళ్ల సంభాషణ అక్కడితో ఆగిపోయింది.

"ఒసేయ్ బాలాదినా! అలా చిక్కి పోయావే మిటే?" అడిగింది ప్రేమగా మరదలు సుగుణా వాళ్ళమ్మగారు.

"ఆ!..ఏం లేదమ్మా...దర్జీది జాకెట్టు వదులుగా కుట్టినట్టుంది" అన్నారు సత్యంగారు చిరునవ్వులు వొలకబోస్తూ.

"చాల్లెండి మీ జోకులు. నేనీమధ్య కొంచెం చిక్కానని, చాలామంది అంటున్నారు" కోపం ప్రదర్శించింది బాల.

"అన్నయ్యగారి అరవయ్యో పెళ్లిరోజున కూడా ఆకతాయితనం పోలేదు" అంది అక్కడున్న సుబ్బమ్మగారు.

"కోతివేషాలు" అంది ముఖం ముడుచుకునే బాల.

అంతలో పిల్లలు వాళ్ల వాళ్ల స్నేహితులతో వచ్చి పరిచయాలు చేశారు. వాళ్ళు ఏవేవో గిఫ్ట్ బాక్సులు ఇచ్చి "హ్యాపీ మ్యారేజ్ డే" అంటూ కరచాలనం చేసి వెళ్లారు.

"ఆ పెద్ద ప్యాకెట్‌లో ఏముందో?" అన్నారు సత్యంగారు వాళ్లిచ్చిన పెద్ద ప్యాకెట్‌ను చూపిస్తూ.

"ఏమిటా అడగడం? సభ్యత లేకుండా!" కసిరింది బాల.

"అహా!...అందులో ఏవైనా తినుబండారాలయితే..." అంటూ ఏదో చెప్పబోయి కళ్లు పెద్దవి చేసి కోపంగా చూస్తున్న ఆమెను చూసి "అమ్మో!" అన్నాడు పెద్దగా ఎడమ చెయ్యి తీసి కుడిచేతి మీద రాసుకుంటూ, ఎవ్వరికీ కనబడకుండా చిటుక్కున గిచ్చిన బాలవైపు ఏడవలేక నవ్వుతూ చూస్తూ.

అక్కడివాళ్ళు... గిఫ్టు తెచ్చిన వాళ్ళు ఆవిడ గిచ్చుడం చూశారో లేదాగానీ, కిసుక్కున నవ్వుతూ... "ఆ పెద్ద ప్యాకెట్లో వున్నవి ఘంటసాలగారి భగవద్గీత క్యాసెట్లు" అన్నారు.

"మహా ప్రసాదం" అంటూ కళ్లకద్దుకున్నారు సత్యంగారు.

అంతలోనే అతిథుల రద్దీ పెరిగింది ఒక్కసారిగా. సత్యం, పిల్లలూ, బాలా అందరూ ఎవరి స్నేహితులతో వాళ్లు బిజీగా ఉన్నారు.

"బాలగారు కళ్యాణ షష్ఠిపూర్తి చేసుకుంటున్నావిడలా లేదుకదూ?" అంది పేరిందేవి.

"నువ్వు గమనించావా? అక్కడక్కడా తెల్ల వెంట్రుకలున్నాయి తల్లో కానీ పూర్తిగా జుట్టు నెరవలేదు సుమా!" అంది అందరిలోకీ మహిళా మండలిలో చిన్నావిడ ప్రియంవద.

"బాలగారి పళ్లు కూడా చాలా గట్టివి. ఎక్కడా కదలడం లేదుట'' అంది నీలవేణి.

వాళ్ళ మాటలకు మురిసిపోతూ మెలికలు తిరిగిపోయింది బాల.

అంతలో బేరర్లు రకరకాల స్నాక్స్ ట్రేలో పెట్టి అందరికీ అందిస్తున్నారు.

ఆలూ టిక్కా, మంచూరియా...ఏవేవో పట్టుకొస్తున్నారు. మరికొందరు పల్లీ పట్టీలూ, నువ్వుండలూ, కూల్‌డ్రింక్స్ సప్లయి చేస్తున్నారు.

"చూశారా భానుమతిగారూ...మనవారి తెనుగుతనం. మన సంస్కృతికి ఎక్కడా లోటు రాకుండా అచ్చమైన తెనుగు స్నాక్స్ కూడా పెట్టారు'' అంటూ మైసూర్‌పాక్ ముక్క అందుకుంది. ఒకావిడ ప్లేట్లో కాజూ పకోడి వేసుకుని, ఫోర్క్‌తో తినడానికి ప్రయత్నిస్తూవుంటే పకోడి ఆ ఫోర్క్ ముళ్లకి చిక్కక... పకోడి కోడి పిల్లలా ప్లేట్లోంచి ఎగిరి గంతేసింది.

"పకోడీలు గట్టిగా వున్నాయ్ బాబూ!'' అందావిడ అదేదో తన తప్పు కాదన్నట్టు.

సరిగ్గా అప్పుడే అక్కడికొచ్చిన సత్యంగారు నవ్వుతూ "ఇదే మా ఆవిడయితేనా.. సుబ్బరంగా పకోడీని నోట్లో పెట్టి కొరికేసేది'' అన్నారు. ఆ మాటలకి అందరూ పకపకా నవ్వేశారు.

"నా దంతసిరిని చూసి తన పళ్లు ఊగులాడుతున్నాయని అసూయ ఆయనకి'' అంది నవ్వుతూ ఒక పకోడి నోట్లో వేసుకుంటూ.

ఏదో టప్‌మని శబ్దమయినట్టయింది బాలకి. పట్టించుకోకుండా అందరితోపాటు ప్లేటు పట్టుకుని వడ్డించుకుంది. నోట్లో ముద్ద దిగడం లేదు.

ఏదో అడ్డుపడుతున్నట్టనిపించింది. మెల్లగా కాస్త అందరినీ దాటుకుంటూ పక్కకి వెళ్లి, నోట్లో వేలుపెట్టి చేతికి తగులుతున్న పదార్థాన్ని బయటకి తీసి చూసింది.

అంతే! గుండె అదిరినట్టయింది. కళ్లల్లో నీళ్లు నిండాయి. రెండు దంతాలు ఊడి చేతిలో పడ్డాయి. పట్టుచీరా, కొత్త చీరా అని ఆలోచించకుండా, పమిట చెంగుతో కళ్లు తుడుచుకుంది.



అందరూ హాయిగా ఎవరి స్నేహితులతో వాళ్లు కబుర్లు చెప్పుకుంటూ భోంచేస్తున్నారు. తననెవరైనా చూస్తున్నారేమోననుకుంటూ, ఉప్పెనలా పొంగుకొస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ, అక్కడున్న ఒక కుర్చీలో కూర్చుంది. అప్పుడే రెండు పెద్ద మైసూరుపాకు ముక్కల్ని తెచ్చి ప్లేట్లో వెయ్యబోయారు సత్యంగారు.

"అవి కూడా బాగా ముదురుపాకం ఒచ్చేశాయండి. గట్టిగా వున్నాయ్..కొరకలేం!'' అంది బాపూ బొమ్మలాంటి ఒక లావుపాటి పిన్నిగారు.

"మా ఆవిడకి మంచి దంతసిరి వుంది. ఏం ఫరవాలేదు'' అంటూ ఆ తెచ్చిన ముక్కల్ని ఆమె ప్లేట్లో వేశారాయన. "నా పళ్లు వీకు. అందుకే నేను బ్రెడ్ పుడ్డింగూ, గులాబ్ జామూ తప్ప ఇంకేమీ తినలేను'' అన్నారు నవ్వుతూ.బాల అతనివైపు కొరకొరా చూసింది. ఆ చూపులు తట్టుకోలేక అక్కడినుంచి వెళ్లిపోయారాయన. కాస్సేపటికి అతిథులందరూ తిరుగు ముఖం పట్టారు. ఎడం చేతిని బుగ్గకానించుకుని, వెళ్లొస్తామని చెప్పిన వాళ్లందరికీ, కుడి చెయ్యి ఊపుతూ 'బై' చెప్పింది బాల.

"చూశావా బాల స్టైలు! మనం వెళ్లొస్తామని నమస్కారం పెడితే, ఆవిడ గొప్పగా చెయ్యూపుతూ బై చెప్పింది'' అందొకావిడ.

"కొడుకులిద్దరూ ఇంత వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించారని అహంకారం'' అంది మహిళా మండలి ప్రెసిడెంటు కమలకుమారి.

వాళ్ల మాటలు సత్యం బాలా ఇద్దరూ విన్నారు. మనసులో ముల్లు గుచ్చుకున్నట్టయింది. సంతోషమంతా నీరుగారిపోయినట్టు మౌనంగా ఇల్లు చేరుకున్నారు ఇద్దరూ. బెడ్‌రూమ్‌లో బట్టలు మార్చుకుంటూ "ఎప్పుడూ లేనిది ఎందుకలా చేశావ్ బాలా?'' ఆప్యాయంగా అడిగారు సత్యంగారు.

బాధనింకా గుండెలో దాచుకోలేక, తలుపులు దగ్గరగా వేసి బావురుమంది బాల. కంగారుపడిపోతూ ఆమెని దగ్గరగా తీసుకుని "ఏం జరిగింది?'' అయోమయంగా అడిగారు ఆమె కన్నీళ్లు తుడుస్తూ.

ఎడంచేతి పిడికిట్లో పట్టుకున్న దంతాలని చూపించింది. కళ్లు తుడుచుకుంటూ "నా దంతసిరి పోయిందండీ!'' అంది.

"పిచ్చిదానా! ఏ సిరీ శాశ్వతంగా వుండదే. కానీ, నీ దంతసిరి గురించి నువ్వు గొప్పగా చెప్పుకుంటుంటే నేనెంత సంతోషించేవాడినో తెలుసా? నా పళ్లు సరిగ్గా లేకపోయినా నీకున్నాయనీ, నీ రుచులూ అభిరుచులూ చూసి సరదా పడేవాడిని. అయినా ఇప్పుడు కొంప మునిగిపోయిందేముంది? పళ్ల డాక్టరు దగ్గరకువెళ్లి కొత్తపళ్లు కట్టిస్తాను''

"అయ్యో! పాతికవేలుటండీ...మొన్న మహిళామండలిలో ఒకావిడ కట్టించుకుంది''

"బాలా..పాతిక వేలయితే ఏమిటే? నీ దంతసిరి నీకు రావడం నాకు ముఖ్యం. ఇంక ఆ విషయం మర్చిపో...ఏదీ నవ్వు...'' అన్నారు చిలిపిగా ఆమె కళ్లలోకి చూస్తూ, మరింత దగ్గరగా తీసుకుంటూ.

"అబ్బ వదలండీ...అబ్బాయిలొస్తారు'' అంది కౌగిట్లో ఒదిగిపోతూనే.

"రార్లేవోయ్... ఆమాత్రం వాళ్లకీ తెలుసు. వాళ్ల భార్యాపిల్లలతో వాళ్లున్నారు'' మంచం మీద కూర్చుంటూ.

"ఏమండీ...మీరూ దంతాలు కట్టించుకోండి. మనకి సిరిసంపదకేమీ లోటులేదు. దంతసిరికెందుకూ లోటు?'' అంది అతని భుజాలమీద తలవాలుస్తూ.

"పిచ్చి బాలా! నాకు మొదటినుంచీ ఏదో ఒకటి తినెయ్యడం తప్ప, ఇది కావాలీ, అది కావాలీ అని ఎప్పుడైనా అడిగానా? కూరలో ఉప్పు తక్కువయినా ఎక్కువైనా తినేసేవాడిని కదూ? నీకు భగవంతుడు తినడం, అరిగించుకోవడం..రెండు శక్తులూ ఇచ్చాడు. నాది అర్భకపు తిండే అయినా, నీ సరదా నాకు ముచ్చటగా వుండేది''

"సరేండి!..అదంతా నాకు తెలీదు. నాతోపాటు మీరూ దంతాలు కట్టించుకోవలసిందే!''

"ఓ.కే.. కనీసం నీ బుగ్గలైనా కొరికేస్తాను..ఆ దంతసిరితో...'' అంటూ దీపాన్నార్పేసారు సత్యంగారు.

"అయ్యో! చీకటి!''

"సీకట్లో సూడాలి ఎంకి నా అందాలు...నండూరి సుబ్బారావుగారి పాట గుర్తులేదూ?'' అన్నారు.

ఆమెకు సమాధానం చెప్పడానికి అవకాశం లేదు. ఆమె ముద్దుల్లో మునిగిపోయింది.

"దంతసిరి కన్నా ముఖ్యం ఆరోగ్యసిరి..ఆనందసిరి'' అన్నారు.

ఆ మాటలు ఆమెకి సన్నాయిలా వినిపించాయి ఆ తన్మయత్వంలో. ★



## అప్పుడు...ఇప్పుడు!

ఒకప్పుడు చిరంజీవి, వెంకటేష్, బాలకృష్ణ, మహేష్‌బాబు లాంటి హీరోలకి జంటగా నటించిన ఆర్తీ అగర్వాల్ ఇప్పుడు ఏ సినిమా ఆఫర్ వస్తే దాన్ని వదులుకునేలా లేదని కనిపిస్తోంది. పోసాని కృష్ణమురళికి జంటగా ఓ సినిమా చేస్తున్న ఆర్తీ అగర్వాల్- ధర్మవరపు సుబ్రహ్మణ్యం హీరోగా నిర్మాణం కానున్న సినిమాలో అతనికి జోడీగా నటించేందుకు ఒప్పుకుందని వార్తల ద్వారా తెలుస్తుంది.

